## ✧•✧•✧ 25 ✧•✧•✧

# "ఈయన దేవుని కుమారుడా?"

*"అందుకు యూదులు – 'మాకొక నియమము కలదు; తాను దేవుని కుమారుడనని ఇతడు చెప్పుకొనెను గనుక ఆ నియమము చొప్పున ఇతడు చావవలెనని' అతనితో చెప్పిరి. పిలాతు ఆ మాట విని మరి యెక్కువగా భయపడెను" (యోహాను 19:7, 8).*

యేసు తీర్పులు చివరి దశలో ఉన్నప్పుడు, పిలాతు రెండు గొప్ప శక్తుల నడుమ చిక్కుబడిపోయినట్లు గ్రహించాడు. ఒక రోమా ప్రభుత్వాధికారిగా, ఈ నిర్దోషియైన ఖైదీ విషయంలో న్యాయసమ్మతమైన తుది నిర్ణయాన్ని ప్రకటించునట్లు ఆయన నైతిక న్యాయవర్తన అతనిని బలవంతం చేసింది. ఏది ఏమైనా, గతంలో తీసికొన్న బలహీనమైన నిర్ణయము చేత వెంటాడబడుచుండిన పరపతి గల ఒక ప్రజా నాయకునిగా, – ఎట్టి పరిస్థితులలోనైనా సరే – యెరూషలేములో అదుపులేని అల్లకల్లోలము జరుగకుండా సమాళించుకొనుటకు ధృఢనిశ్చయముతో ఉండెను. ఆయనను ఒక వైపు తన మనస్సాక్షి లాగుచుండగా దానికి వ్యతిరేకమైన దిశలో తాత్కాలిక రాజకీయ ప్రయోజనకారిత్వము లాగుచుండినది. ఈ రెండునూ బలమైనవే, కానీ సమాన బలముగలవి కావు. ఆయన యూదుల కోరికను అయిష్టంగానైనా అంగీకరించవలసినదని యూదుల నుండి వచ్చుచుండిన ఒత్తడి ఎక్కువ బలమైనదై యుండినది. వారు అసూయ చేత ప్రోద్బలము చేయబడినవారై, యేసు సిలువవేయబడవలెనని – వారు దానిని సాధించుటకు ఏదైనా చేయడానికి సంసిద్ధులై యుండిరి – కేకలు వేయుచుండిరి పిలాతును ఇరకాటంలోనికి నెట్టివేసి, వారనుకున్నది నెరవేరేంత వరకు అతడు బయటికి రాకుండా చూచుకొన్నారు.

యేసు నిర్దోషి యని పిలాతు ఒప్పింపబడియుండినప్పటికిని, ఆయన ప్రధాన యాజకుల దబాయింపులకు భయంతో సద్దుమణిగి యుండుటవలన తీర్పు తన వశములో లేకుండా జారిపోయింది. తీర్పు ప్రారంభంలో, ఆయన తన తీర్పును వారికి తెలియజెప్పాడు; కానీ వారు దానిని అంగీకరించుటకు నిరాకరించారు. గనుక ఆయన యేసును గలిలయ చతుర్థాధిపతియైనవాని సహాయము కోరుచు, హేరోదు నొద్దకు పంపించాడు; కానీ హేరోదు యేసుకు ఎటువంటి తీర్పుగాని యేసును ఏమి చేయవలెనోయను ఆదేశములుగాని ఇవ్వకుండానే తిరిగి పిలాతు యొద్దకు పంపించాడు. చివరి తరుణోపాయంగా, యేసునే విడుదల చేయమని జనసమూహం కోరునని ఆశిస్తూ, పిలాతు పస్కా పండుగలో గల వాడుకను ఆశ్రయించుటకు ప్రయత్నించాడు; కానీ ఆయన అనుకున్నట్లుగాక జనసమూహము బరబ్బను విడుదల చేయవలసినదిగా కోరుకొన్నారు. గనుక యిక పిలాతు నొద్ద ఎంపిక చేసుకొనుటకు

ప్రత్యామ్నాయ మార్గాలేమీ మిగలలేదు.

బహుశ ఒక చిట్టచివరి ప్రయత్నంగా కాబోలు, ఆధారాలు లేనప్పటికిని నిరీక్షణ కలిగియుండి, యేసును కొరడాలతో కొట్టవలసినదిగా పిలాతు ఆజ్ఞాపించాడు (యోహాను 19:1). యేసు అమానుషంగా కొరడాలతో కొట్టబడుట చూచి యూదులు సంతృప్తిచెందుదురని పిలాతు అనుకొనియుండవచ్చును. కొరడా దెబ్బలు తినడమంటే, దాదాపుగా చచ్చిపోయినట్లే. రోమీయుల చేత కొరడా దెబ్బలు తిన్న ఎంతటి బలవంతుడైన మొనగాడైనా మరణానికి మరింత దగ్గరయ్యేవారే. ఈ కొరడా దెబ్బలను సిలువవేయబడుటకు ముందుస్తు చర్యగా యూదులు పరిగణించి, వారు కోరుచున్నట్లే జరుగనైయున్నదని అనుకొంటూ, శాంతించుదురని కూడ పిలాతు అనుకొనియుండవచ్చును.

యేసు కొరడా దెబ్బలు కొట్టబడి పరిహాసము చేయబడుట ద్వారా అవమానపర్చబడిన తరువాత (యోహాను 19:1–3). ఆయనను విడుదల చేయుటకు పిలాతు మరొక్కసారి యత్నించాడు. "పిలాతు మరల వెలుపలికి వచ్చి – 'ఇదిగో, ఈయనయందు ఏ దోషమును నాకు కనబడలేదని మీకు తెలియునట్లు ఈయనను మీయొద్దకు వెలుపలికి తీసికొని వచ్చుచున్నానని' వారితో అనెను. ఆ ముండ్ల కిరీటమును ఊదారంగు వస్త్రమును ధరించినవాడై, యేసు వెలుపలికి రాగా, పిలాతు – ఇదిగో ఈ మనుష్యుడు అని వారితో చెప్పెను" అని వాక్యభాగము చెప్పుచున్నది (యోహాను 19:4, 5).

ఆయన చేయవలసిన మరియు చేయగలిగిన దానిని మించి అత్యధికంగా చేశాడనియు యేసును వారి ఇష్టానికే విడిచిపెట్టుట తప్ప బహుశ యిక చేయునదేమీ లేదను విషయమంతా ఎరుకైనవాడై, సిలువ మరణమునకు అప్పగింపబడవలెనని వారు ఆశించుచుండిన వాని దయనీయమైన పరిస్థితి ఎంత ఘోరంగా ఉండిందో గమనించాలని పిలాతు వారినడిగాడు. యేసు కొరడా దెబ్బల వలన కారుచుండిన రక్తపు మరకలతో, వారందరి యెదుట నిలువబడి యున్నాడు. ఆయన భుజాలపై అపహస్యమునకు గురుతైయుండిన ఊదారంగు వస్త్రము కప్పబడింది, ఆయన తలపై వారి క్రూరత్వమును సూచించుచుండిన ముళ్ల కిరీటము పెట్టబడింది. యేసు నేరస్థుడని రుజువుచేయుటకు ప్రయత్నించుచుండిన వారు, "మేము ఆయనను అవమానపర్చాము, కొరడా దెబ్బలు కొట్టాము, మరియు ఆయన అపరాధిత్వమును బహిరంగముగా చాటిచెప్పాము, గనుక ఇప్పుడు మేము సంతృప్తిచెందియున్నాము. కాబట్టి నీవు ఆయనను విడుదలచేయుమని" చెప్పుదురని పిలాతు భావించియుండవచ్చును. అలా జరుగలేదు సరికదా, ప్రధానయాజకులు, ఆయన మరణించవలసినదేయను వారి తీర్మానమును మరింత కఠినము చేసుకొని, "సిలువవేయుము, సిలువవేయుము!" అని బిగ్గరగా కేకలు వేశారు. నిరాశవల్ల కలిగిన తెగింపుతో, పిలాతు తన తుది తీర్పును మరలా ప్రకటించాడు: "ఆయనయందు ఏ దోషమును నాకు కనబడలేదు గనుక మీరే ఆయనను తీసికొనిపోయి సిలువవేయుడని వారితో చెప్పెను" (యోహాను 19:6బి). అందుకు యూదులు ఆగ్రహముతో, "మాకొక నియమము కలదు, తాను దేవుని కుమారుడనని ఇతడు చెప్పుకొనెను గనుక ఆ నియమము చొప్పున ఇతడు చావవలెనని అతనితో చెప్పిరి" (యోహాను 19:7).

ప్రధానయాజకులు యేసును గూర్చి చేసిన ప్రకటన పిలాతుకు అదురు పుట్టించింది. ఆయన దేవుని కుమారుడనని యేసే చెప్పాడను అభిప్రాయము పిలాతులో మరింత భయాందోళనను కలుగజేసింది. "పిలాతు ఆ మాట విని, మరి యెక్కువగా భయపడి, తిరిగి

అధికారమందిరములో ప్రవేశించెను” అని వాక్యభాగము చెప్పుచున్నది (యోహాను 19:8) భయం గుప్పిట్లో చిక్కుకొన్న ఆయన మనస్సు, ఆయనను కంపింపజేస్తూ, ఆయన యేసులో చూచిన నిర్దోషత్వమును ఆయనకు గుర్తుచేయుచుండినది. యేసు అని పిలువబడుచు, అవమానపరచబడి, రక్తసిక్తమై, తిరస్కార వస్త్రములు ధరించుకొని, వారి యెదుట నిలువబడి యుండిన వాని అసాధారణమైన స్వభావమును పిలాతుకు యూదుల మాటలు వివరించాయి. యేసు పిలాతుతో ఎవరును ఎన్నడును మాటలాడని రీతిలో మాటలాడాడు: పిలాతు యెదుట యేసు జీవితము లోపరహితమైనదై యుండెను; ఆయన మౌనము సహితము మహనీయమైనదై యుండెను. ఆయన దేవుని కుమారుడనని చెప్పుకొన్నాడని యూదులు చేసిన ప్రకటనలో కూడ సత్యముండినది. “సరే, యేసు చెప్పిన మాటలన్ని సత్యమే అనుకుందాము. అలాగైతే ఆ మాటల్లో గల అంతర్భావముల ప్రభావము ఈ తీర్పుపైగాని నా విషయములో గాని ఏమై యుండవచ్చును?” అని పిలాతు అనుకొనియుంటాడు. కేవలము ఈ సాధ్యతను గూర్చిన ఆలోచనయే ఆయన మనస్సును భయముతో కమ్మివేసింది.

తీర్పులోని ఈ సందర్భంలో, పిలాతు యేసుకు సంబంధించిన ముత్యాల్లాంటి ముఖ్యమైన మూడు సత్యాలు ఎదుర్కొన్నాడు. ఆయన వాటిని ఎదుర్కొనుటను గూర్చి మనము చదువునప్పుడు, ఈ సత్యములు మనము కూడ ఎదుర్కొనవలసినవని పరిశుద్ధాత్మ – పవిత్ర లేఖనాలలో వాటిని లిఖింపజేసినవాడు – మనకు గుర్తుచేయుచున్నాడు. మన రక్షకుని గూర్చిన ఈ తీర్పులు పరిశుద్ధ సత్యవేదమును చదువువారందరికి ఈ సత్యాలను నిరంతరం చాటిచెప్పుచునే ఉంటాయి.

*మొదటి సత్యమేమనగా యేసు తరుచుగా తనను తాను మన హస్తాలకు అప్పగించుకొంటాడు.* అట్టి తరుణంలో ఇతరులు ఆయనతో ఎంత ఘోరంగా క్రూరంగా వ్యవహరించినను మనము ఊరికనే నిలుచుండి చూచు ప్రేక్షకులముగా నుండునట్లు అనుమతిస్తాడు. యేసు, మనము నిశ్చేష్టంగా నిలుచుండియుండుటవలన, అవమానపరచబడినట్లయితే, ఆయన దానిని అనుమతిస్తాడు. ఆయన ఇహలోకానికి ఏతెంచిన హేతువు ఖండించబడునప్పుడు దానిని మనము అనుమతిస్తూవుంటే, ఆయన మన యెదుట మౌనంగా నిలబడియుంటాడు. ఆయన సర్వశక్తిమంతుడైన క్రీస్తై యున్నాడు, ఇది సంశయములేని సత్యము; కానీ కనీసము ఈ లోకములోనైనా ఆయనను గూర్చిన అధికారమును కొద్దిగొప్ప పరిమాణములో, ఆయన మనకు ప్రసాదించాడు. ఆయన మనకు స్వేచ్ఛనివ్వవలెనని కోరుచున్నాడు, మరియు ఈ స్వేచ్ఛాపూర్వకముగా ఎంపిక చేసుకొను వరము అనివార్యముగా ఒక మహత్తరమైన తెగింపుతో కూడినదై యున్నది.

ఆయన మనలను స్వతంత్రులైన నైతిక ప్రజలనుగా చేశాడు. ఆయన మనకు బోధిస్తాడు, మన కొరకు వేచియుంటాడు, మరియు మనలను ప్రోత్సాహిస్తాడు; కానీ అసత్యమునకు మనలను మనము అప్పగించుకొనుటను ఆయన అనుమతించడు. మనము దాని అవసరతను గమనించాలి, దాని నిమిత్తము అవసరమైన త్యాగము చేయాలి, మరియు దాని కొరకు తెరువబడు ద్వారముల గుండా నడచివెళ్లాలి. పిలాతుగాని ప్రధానయాజకులుగాని, మరియు జనసమూహముగాని ఆయన యొక్క భవిష్యత్తును నిర్ణయించుటకు ఆయన ఎందుకు అనుమతించాడు? దీనికి జవాబు ఆయన మనకు రక్షణను సమకూర్చవలెనను కోరికకును మనకు మానవ స్వతంత్రమును ఇవ్వవలెనను కోరికకును మధ్య కలదని స్పష్టమగుచున్నది.

*రెండవ సత్యమేమనగా యేసు దేవుని కుమారుడుగా ఎంచబడవలెను.* సువార్తల నివేదికలయందంతటను, మనము ఆయనను కేవలము ఒక మానవుడుగా మాత్రమే గుర్తించుటకు అనుమతించబడలేదు. ఆయన సంపూర్తిగా మానవత్వమును ధరించాడు, కానీ ఆయన శరీరధారియైన దేవుడైయుండెను ఆయన జన్మించినప్పుడు, బాప్తిస్మము పొందినప్పుడు, రూపాంతరము చెందినప్పుడు మరియు ఆయన తీర్పులలో సహితము ఆయన యొక్క దైవికమైన స్వభావము వెల్లడించబడింది. తిరుగులేని ఆయన అద్భుతాలు, సంపూర్ణమైన ఆయన సందేశాలు, సాటిలేని ఆయన ప్రవర్తన, మరియు విశిష్టమైన ఆయన దివ్యదృష్టి మొదలైన అన్నీ కలిసి ఆయన ఎవరైయున్నారో వెల్లడిస్తున్నాయి.

ఈ తీర్పులో పిలాతైనను యూదులైనను క్రీస్తు యొక్క దైవత్వమును ఎదుర్కొనకుండా సాక్షులై యుండలేకపోయారు మరియు పాల్గొనలేకపోయారు. ఈ విషయాన్ని యేసు ప్రకటించాడు. ఆయన చర్యలు దానిని ద్రుఢపర్చాయి. ఒకరు యేసుతో సంబంధము ఎప్పుడు కలిగియున్నా, వారు ఆయన దైవత్వమును ఎదుర్కొంటారు.

ఇతరులు ఈ సత్యమును గూర్చి మాట్లడారు, కానీ ఆయనే సత్యమై యుండెననియు సత్యమైయున్నాడనియు యేసు బయలుపర్చాడు. ఆయన ఎవరైయున్నారో అను స్వభావమునకు సంబంధము లేకుండా ఆయన ఎన్నడు ప్రవర్తించలేదు. కొంత మేరకు, పిలాతు యేసు ఎవరైయుండెనో గుర్తించాడు; కానీ అతని బలమైన సంకల్పము దాని గూర్చి ఆయన ఎటువంటి చర్య తీసుకొనకుండా నిరోధించింది మనము సత్యము కావాలనుకొంటాము – కానీ సత్యము తెలిసినప్పుడు, సత్యము దొరికినప్పుడు, ఆ సత్యముతో ఏమి చేయాలో మనమెరుగుదుమా?

*మూడవ సత్యమేమనగా యేసు దేవుని కుమారుడను వాస్తవమును మించినదేదియును మన మనస్సుల్లో ఎక్కువ భక్తిశ్రద్ధలనుగాని భయమునుగాని పుట్టించకూడదు.* పిలాతు భయపడిపోయాడంటే ఆశ్చర్యమేమి లేదు! పిలాతు అధ్యక్షతన నిర్వహింపబడిన తీర్పు ఒక అనర్థకమైన అంశమయ్యింది. యేసును గూర్చి మనమూహించుకొనగల ఏ విషయమైనా అది హేతువిరుద్ధమైనదై యుండినది. పిలాతు, తీర్పు ముగింపునకు వచ్చినప్పుడు, మనోనేత్రాలు అప్పుడు తెరువబడ్డాయి గనుక తానెటువంటి సందిగ్ధావస్థలో ఉండెనో కొంచెము కొంచెము అర్థం చేసికొనుటకు ఆరంభించాడు. ఆయన తీర్పు తీర్చిన యేసు నిజముగా దేవుని కుమారుడైనట్లయితే, చరిత్ర ఆయనను లోకము ఎప్పుడూ ఎరుగని ఘోరాతిఘోరమైన ప్రభుత్వాధికారిగా చిత్రీకరిస్తుంది మరియు ఎవరును చేయజాలని ఘోరాతిఘోరమైన పొరపాటు చేశాడను రంగు ఆయనకు అడ్డబడుతుంది. జనసామాన్యమైన ఏ అధికారియైనా దేవునితో చెడుగా వ్యవహరించుటను మనమూహించుకొనగలమా? ఒకసారి ఆలోచించండి! పిలాతు ఆయనను సృజించిన దేవునితో సముచితంగాను న్యాయసమ్మతంగాను వ్యవహరించుటకు మంచి తరుణముండినప్పుడు, దుష్టులైనవారు ఆ దేవుని ఎగతాళిచేయుచు దూషించుటకును హింసించుటకును ఆయన అనుమతించాడు! తీర్పు దినాన పిలాతు యేసు యెదుట నిలువబడినప్పుడు అతడు ఆయనకు ఏమని సమాధానమివ్వగలడు?

మనము ఈ వాక్యభాగము నుండి మరొక అంశములోనికి వెళ్లక మునుపు, ఒక కోణంలో చూస్తే, పిలాతు ప్రక్కలో మనము కూడ నిలువబడి యున్నామని జ్ఞాపకముంచుకొందాము. యేసు మనముందున్నాడు. మనకిష్టమువచ్చినట్లు ఆయనతో వ్యవహరించుటకు అనుమతిస్తూ

ఆయన తననుతాను మన చేతులకు అప్పగించుకొంటున్నాడు. యేసు దేవుని కుమారుడనియు, సర్వశక్తిమంతుడైన క్రీస్తనియు, మనము లేఖనముల ద్వారా తెలిసికొనుచున్నాము. యేసు దైవత్వమును గూర్చిన ఈ సత్యము మనలను భయముతో నింపేస్తుంది లేదా మనము ఆయన యెదుట సాగిలపడి ఆయనకు నమస్కరింపజేస్తుంది. ఆయన కేవలము మనము గౌరవింపదగు ఒక పరిపూర్ణుడు కాదు; లేదా అమితాశ్చర్యంతో నిలబడి అలాగే చూడదగు సామాన్య మానవుని కంటె అధికుడైనవాడు కాదు. ఆయన దైవమానవుడై యున్నాడు, మనము గౌరవింపదగు, భక్తిశ్రద్ధలతో పూజింపదగు, మరియు స్తుతింపదగు దైవత్వములోని రెండవ వ్యక్తియై యున్నాడు.

❖◆❖◆❖

*సమస్తమును ఎరిగినవాడును సకల సృష్టిని సృజించినవాడును శాశ్వతుడైయున్నవాడు మానవుడు మాత్రమే కాలేదు గాని (అంతకు మునుపు) శిశువయ్యాడు, మరియు (యింకా అంతకు మునుపు) ఒక స్త్రీ గర్భములో పిండమునై యుండెను. ఆయనే మానవుడై జీవించుటకు నమ్రతతో తనను తాను తగ్గించుకొని దిగివచ్చుట గూర్చిన వివరాలను విశదంగా గ్రహించవలెనని నీవు ఆశిస్తున్నట్లయితే, నీవు ఒక మెత్తని నత్తలాగా లేదా ఒక పీతలాగా అగుటకు ఇష్టపడుదువో లేదో కొంచెమాలోచించుము!*[1]

---

సూచన

[1]Adapted from C. S. Lewis, *Mere Christianity*, rev. and enl. ed. (New York: Macmillan Co., 1952), 155.